# శాంతి సందేశము



రచన

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ
మసీహె మౌవూద్, మహ్దీ మాహూద్
అలైహిస్సలాం

# శాంతి సందేశము


రచన

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని
మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్
అలైహిస్సలాం

అనువాదము: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్



ప్రచురణ

నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్
జిల్లా: గుర్దాస్‌పూర్. పంజాబ్ - 143516

**Shanti Sandeshamu**
Telugu Rendering of

**Paigham-e-Sulah (Urdu)**
Written By
Hadhrat Mirza Ghulam Ahmad of Qadian
The Promised Messiah and Mahdi [as]

Translated from Urdu into Telugu By
Hafiz Syed Rasool Niyaz

| | |
|---|---|
| 1st Telugu Edition Published in India | : 2002 |
| 2nd Telugu Edition Published in Qadian | : April 2017 |
| Copies | : 1000 |

Printed at : Fazl-e-Umar Printing Press
Harchowal Road Qadian

Published by : Nazarat Nashr-o-Isha'at,
Sadr Anjuman Ahmadiyya Qadian
Dist: Gurdaspur, Punjab, India,143516

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

# ముందు మాట

"***పైఘామె సులహ్***" అనగా "***శాంతి సందేశము***" అను నామముతో అహ్మదియ్య సంస్థ స్థాపకులు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం ప్రపంచానికిచ్చిన అంతిమ సందేశము. ఈ మహా గొప్ప వ్యాసములో సయ్యద్నా హజ్రత్ అఖ్దస్ అలైహిస్సలాం భారత ఉపఖండము లోని రెండు అతి పెద్ద జాతులు హిందువులు, ముస్లిములలో శాంతి, సామరస్యమును ఏర్పాటు చేయుటకు హృదయపూర్వకంగా సూచనలు చేయుచు విలువైన ప్రతిపాదనలు చేశారు. జాతుల మధ్య ద్వేషము, సమాజములో అంతరమునకు అసలు కారణము మత విభేదమేనని హుజూర్ నిర్ధారించారు. సమస్త మతాల గొప్ప సత్కార్యులను, పుణ్యులను గౌరవించాలని, వారి మతాల పుణ్యక్షేత్రాల గౌరవమును కాపాడాలని ఇస్లాం బోధించుచున్నది. ఇస్లాం మత సామరస్యము, ఐక్యత గూర్చి గల ఇస్లాం బోధనల సారాంశమును కూడ ఈ పుస్తకములో హుజూర్ ప్రస్తావించారు. ఈ వాస్యములో హుజూర్ అలైహిస్సలాం సూచించిన సూత్రములు మత వ్యాకులత, విద్వేషమును దూరము చేయుటకు ఏకైక పరిష్కారముగా నిలిచెను. వీటిని విస్మరించి ప్రతిపాదించిన ఇతర సూత్రములు, ప్రణాళికలు విఫలమగును. ఈ పుస్తకములో చర్చించిన అంశము ఎంతో ముఖ్యమైనందున అనేక సార్లు ముద్రించబడెను. సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఆమోదముతో నజారత్ నష్రో ఇషాఅత్

(ప్రచురణ విభాగము) ఖాదియాన్ ఈ పుస్తకమును ప్రజా ప్రయోజనము దృష్ట్యా తెలుగులో రెండవ సారి ప్రచురించుచున్నది. అల్లాహ్ తఆలా అన్ని విధాలా దీనిని లాభదాయమకు చేయుగాక! జాతుల మధ్య ద్వేషమును అంతమొందించి ప్రజలలో అనిర్వచనీయ ఆప్యాయత, సోదరభావము, ఐక్యత, అనురాగమును ఏర్పాటు చేయుగాక! ఈ శాంతి సందేశమును పాఠకులు మనసారా అర్థము చేసుకొని ఇతరులకు కూడ అందింతురని ప్రార్థించుచున్నాము.

ఈ పుస్తకమును తెలుగులో హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ అనువదించగా, షేక్ ఇబ్రాహీమ్ నాసిర్ పునఃపరిశీలన చేసిరి, ముహమ్మద్ లతీఫ్ షరీఫ్ ప్రూఫ్ రీడింగ్ చేసిరి. వీరితో పాటు సహకరించిన గౌ॥తన్వీర్ అహ్మద్ తెలుగు ప్రచురణ విభాగాధ్యక్షులు గార్లందరికి అల్లాహ్ తఆలా చక్కటి ప్రతిఫలము నొసంగుగాక ! ఆమీన్.

ఇట్లు
హాఫిజ్ మఖ్దూమ్ షరీఫ్
నాజిర్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్
గుర్దాస్‌పూర్, పంజాబ్

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْم

نَحْمَدُهٗ وَنُصَلِّي عَلٰى رَسُوْلِهِ الْكَرِيْم

ఓ సర్వశక్తి గల అల్లాహ్ ! ఓ నా ప్రియ మార్గదర్శకుడా ! సత్యవంతులు, నిజాయితీపరులు నిన్ను పొందు మార్గము మాకు చూపుము. దుష్కార్యములు, కపటము, వైరము, ఇహలోక వ్యామోహమే లక్ష్యమైన మార్గముల నుండి మమ్ము రక్షించుము.

ప్రియ శ్రోతలారా ! మనమందరము అనగా ముస్లిములము, హిందువులము వందలాది విభేదాలున్నను ఈ ప్రపంచ సృష్టికర్త, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను విశ్వసించుటలో ఏకాభిప్రాయము కలిగివున్నాము. మానవ నామములో మనమందరము భాగస్వాములమే. అనగా మనమందరము మానవులనబడుదుము. ఒకే దేశ నివాసులమై నందున ఒకరికొకరం పొరుగింటివారము. కనుక మనసారా, సదుద్దేశము తో పరస్పరం మనం మిత్రులుగా మారవలెను. ధార్మిక, ప్రాపంచిక కష్టాలలో ఒకరికొకరు హృదయపూర్వకముగా సహకరించుకొనవలెను. ఒకరు మరొకరి అవయముల వలె స్పందించి పరస్పరం అన్యోన్యముగా తోడ్పాటునందించుకొనవలెను.

ఓ మన దేశవాసులారా ! సాధారణ సహకార హితబోధ రహిత ధర్మము, ధర్మం కాదు. సామాన్య సహాయ భావ రహిత వ్యక్తి మానవుడు కాదు. మన దేవుడు ఏ జాతిని విస్మరించలేదు. ఆర్యా వరత్ కు చెందిన ప్రాచీన జాతులకు అందించిన మానవ శక్తి, సామర్థ్యాలను అరబ్బులు, పారశీకులు, సిరియావాసులు, చైనీయులు, జపానీయులు, ఐరోపా, అమెరికా జాతులకు కూడ ప్రసాదించబడెను. అల్లాహ్ భూమి అందరికి పరుపుగా ఉపయోగపడుతుంది. అతని సూర్య, చంద్రులు, అనేక

నక్షత్రములు అందరికి కాంతినందించుచు ఇతర సేవలు కూడ అందించుచున్నవి. అతను సృష్టించిన పృధివ్యాధి భూతములు అనగా వాయువు, జలము, అగ్ని, పృథ్వీ అలాగే అతను సృష్టించిన ఇతర వస్తువులు ధాన్యము, ఫలములు, మందులు (ఔషధములు), మొదలగు వాటి ద్వారా సర్వజాతులు లబ్ది పొందుచున్నవి. కనుక ఉపకారము, సత్ప్రవర్తనతో వ్యవహరించుచు విశాల మనస్సును ప్రదర్శించుచు సర్వజనులతో ప్రవవర్తించవలెనని ఈ దైవ సహజ గుణములు మనకు బోధించుచున్నవి.

మిత్రులారా ! మన ద్విజాతులలోని ఏ ఒక్క జాతి దేవుని సద్గుణములను గౌరవించక, అతని పవిత్ర ప్రవర్తనలకు విరుద్ధముగా కొనసాగినచో ఆ జాతి తొందరగా నాశమగునని గ్రహించుము. తానే కాక తన సంతానమును కూడ నాశనము చేయును. దేవుని సద్గుణములను అవలంభిచుట మానవ జాతి మనుగడకు అమృతమని ఈ ప్రపంచ ప్రారంభము నుండి అన్ని దేశాల సత్యమూర్తులు సాక్ష్యమిచ్చుచు వచ్చారు. శాంతి చెలిమ అయిన దేవుని పరిశుద్ధ ప్రవర్తనలను అనుసరించుట పైనే మానవ శారీరక, ఆధ్యాత్మిక జీవితము ఆధారపడి వున్నది.

ఫాతిహా అధ్యాయములో నున్న اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ (అల్ ఫాతిహా: 2) అను సూక్తి తోనే దేవుడు పవిత్ర ఖుర్ఆన్ ను ఆరంభించెను. అనగా ఆ సకల లోకాల సంరక్షకునికే సకల సంకీర్తనములు. లోకం అను పదములో విభిన్న జాతులు, వివిధ కాలములు అనేక దేశములున్నవి. పవిత్ర ఖుర్ఆన్ ఈ సూక్తితో ప్రారంభమైనందున సామాన్య సంరక్షణ, ఔదార్యము తమ జాతి వరకే పరిమితమని ప్రకటించుచున్న జాతుల వాదనను తిరస్కరించినట్లు అయినది. ఇతర జాతుల వారు అల్లాహ్ దాసులు కారని, అల్లాహ్ వాటిని సృష్టించి వృధాగా వదిలేశాడని, లేక వాటిని

మరచిపోయాడని (నవూజుబిల్లాహ్) వాటిని అతడు సృష్టించనే లేదని ఇటువంటి జాతుల అభిప్రాయం. ఉదాహరణకు అవతరించిన దైవ ప్రవక్తలు, అవతారులందరు యూదుల కుటంబం నుండి మాత్రమే అవతరించారని యూదులు, క్రైస్తవులు నేటి వరకు విశ్వసించుచున్నారు. దేవుడు ఇతర జాతులపై ఆక్రోషముతో నున్నందుకు అవి మార్గభ్రష్టులైనను, అశ్రద్ధలో మునిగిపోయినను వాటిని పట్టించుకోలేదు. అందుకే నేను ఇస్రాయిల్ గొర్రెల సంస్కరణకు మాత్రమే పంపబడ్డానని హజ్రత్ మసీహ్ అలైహిస్సలాం ప్రవచించినట్లు బైబిల్‌లో వ్రాసియుంది. దైవ ప్రకటన చేసిన తర్వాత ఇటువంటి స్వల్ప ఆలోచనతో కూడిన విషయమును ఉచ్ఛరించటం ఆశ్చర్యకరము. ఇస్రాయిల్ సంతతి వారికి మాత్రమే మసీహ్ దేవుడా ? మిగతా జాతులకు దేవుడు కాడా ! అందుకే కాబోలు ఇతర జాతుల సంస్కరణ, మార్గదర్శనముతో నాకు సంబంధం లేదని ఇటువంటి ప్రకటన చేసి వుంటారు ?

మూలమేమనగా ప్రవక్తలు, అవతారులందరు వారి కుటుంబము నుండే వచ్చారని, వారి వంశములోనే దైవ గ్రంథములు అవతరించినవని యూదుల, క్రైస్తవుల విశ్వాసము. సువార్తవాణి పరంపర హజ్రత్ ఈసా అలైహిస్సలాంతో అంతమై, వారి తర్వాత దైవ సంభాషణ, సువార్తవాణి ద్వారము మూయబడినదని క్రైస్తవుల విశ్వాసం.

ఆర్యా సమాజపు సభ్యులు కూడ ఇలాంటి అభిప్రాయాలకే కట్టుబడి వున్నారు. అనగా యూదులు, క్రైస్తవులు ప్రవక్తృత్వము, సువార్తవాణిని ఇస్రాయిల్ వంశానికే పరిమితం చేసి, గర్వ పడినట్లు ఆర్య సమాజపు సభ్యులు కూడ ఇలాంటి విశ్వాసమే కలిగియుండుట దుర్భృష్టకరము. అనగా దైవసంభాషణ, సువార్తవాణి ఆర్య సమాజపు ప్రహరీ ఏ నాడు దాటలేదని వారి నమ్మకము. సదా ఈ దేశము నుండే నలుగురు ఋషులు

ఎన్నుకోబడుదురని, వేదము మాత్రమే సదా అవతరించునని, ఈ సువార్తవాణి కొరకు సంస్కృత వేదములే సదా ప్రత్యేకించబడినవని వారి అభిమతం.

ఉద్దేశమేమనగా ఈ ఇరుజాతులు దేవున్ని సకల లోకాల సంరక్షకునిగా గుర్తించటం లేదు. ఇస్రాయీలీయుల సంరక్షకుడు లేదా ఆర్యుల సంరక్షకుడు కాడు. అతడు సకల లోకాల సంరక్షకుడు ఏ ఒక్క జాతితో శాశ్వత సంబంధమేర్పరచుకున్నచో పక్షపాతం స్పష్టమవుతుంది. కనుక ఈ తరహా విశ్వాసములను ఖండించుటకే దేవుడు పవిత్ర ఖుర్ఆన్‌ను اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ (అల్ ఫాతిహా:2) తో ప్రారంభించెను. ఒకే జాతి, ఒకే దేశములోనే దైవ ప్రవక్తలు వస్తూ వున్నారనడం భావ్యము కాదని అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో స్పష్టపరిచెను. అల్లాహ్ ఏ జాతిని, దేశాన్ని విస్మరించలేదు. ప్రతి దేశ వాతావరణానికి అనుగుణంగా ఆ దేశ నివాసులకు అల్లాహ్ శారీరక శిక్షణ నిచ్చుచు వచ్చినట్లు ప్రతి దేశానికి, ప్రతి జాతికి ఆధ్యాత్మిక శిక్షణ కూడ అందించెనని పవిత్ర ఖుర్ఆన్‌లో వివిధ సామెతల ద్వారా వివరించెను. పవిత్ర ఖుర్ఆన్‌లో ఒక చోట అతడిట్లు ప్రవచించెను. وَاِنْ مِّنْ اُمَّةٍ اِلَّا خَلَا فِيْهَا نَذِيْرٌ (ఫాతిర్: 25) అనగా అల్లాహ్ వైపు నుండి ప్రవక్త, అవతారుడు రాని జాతి ఏదియును లేదు.

కావున నిజమైన. సంపూర్ణ దేవుడే సకల లోకాల సంరక్షకుడని వాదనలకతీతంగా ప్రతి మానవుడు విధిగా విశ్వసించవలెను. అతని సంరక్షణ ఏ ఒక్క జాతికి పరిమితం కాదు. ఒక నిర్ణీత కాలము లేదా ప్రత్యేక దేశము కొరకు కాదు అతడు సర్వ జాతుల సంరక్షకుడు. అతడే అన్ని కాలములకు, సర్వ లోకాలకు, అన్ని దేశాలకు పోషకుడు. సర్వ శుభములకు మూలము అతడే. ప్రతి శారీరక, ఆధ్యాత్మిక శక్తి అతని నుండే వెలువడును. సృష్టి మొత్తం అతని సంరక్షణే పొందుచున్నది.

ప్రతి ఉనికికి ఆధారం అతడే.

అల్లాహ్ అనుగ్రహము (అందరికి సమానమే) సామాన్యమైనది. అది సర్వజాతుల, సర్వదేశాల, సర్వకాలములకు విస్తరించియున్నది. ఏ జాతికి కూడ అభ్యంతరము తెలిపే అవకాశమివ్వకూడదనే ఇట్లు జరిగింది. దేవుడు ఫలానా ఫలానా జాతిని కనికరించెను, కాని మమ్ములను అనుగ్రహించలేదు. సన్మార్గము పొందుటకు ఫలానా జాతికి గ్రంధము లభించినది. కాని మాకు లభించలేదు. ఫలానా కాలములో అల్లాహ్ తఆలా తన దైవవాణి, సువార్తవాణి, మహిమలతో ప్రత్యక్షమయ్యెను. కాని మా కాలములో అతడు అదృశ్యమయ్యెను. సామాన్య అనుగ్రహమును చూపించి ఇటువంటి అభ్యంతరాలను రూపుమాపెను. అతడు తన విశాల ప్రవర్తనలను చూపి ఏ జాతిని కూడ శారీరక, ఆధ్యాత్మిక అనుగ్రహముల నుండి దూరముంచలేదు. ఏ కాలమును దురదృష్టముగా వదలలేదు.

కావున మన దేవుని ప్రవర్తనలు ఇలా ఉండగా మనము కూడ ఆ ప్రవర్తనలను అనుసరించుట తప్పనిసరి. కనుక ఓ మన దేశ సోదరులారా! "శాంతి సందేశము" అను నామముతో ఈ సంక్షిప్త పత్రికను మీ ముందు సగౌరవముగా ప్రవేశపెట్టనైనది. శక్తిమంతుడైన ఆ దేవుడు స్వయాన మీ హృదయాలలో సువార్తవాణితో అవతరించవలెనని మనస్ఫూర్తిగా ప్రార్థించనైనది. మా సహాయ రహస్యమును మీకు తెలుపుగాక ! ఈ మిత్రుత్వ బహుమానము ప్రత్యేక ఉద్దేశము, స్వప్రయోజనము కొరకు కాదని మీరు గ్రహించుదురు గాక ! ప్రియులారా!! సాధారణ ప్రజలు ప్రళయ దిన సమస్య గూర్చి పూర్తి అవగాహన కలిగివుండరు. మరణించక ముందే మరణించిన వారు మాత్రమే ప్రళయ దినపు రహస్యమును తెలుసు కొందురు. కాని ఇహలోక (మంచి చెడు) పాప, పుణ్యమును దూరదృష్టి గల ప్రతి జ్ఞాని గుర్తించవచ్చును.

ఏ విధంగానూ తొలగని బాధలు, ఏ ఉపాయముతో సడలని కష్టాలు ఐక్యతతో  తొలగి పోవునను విషయము అందరికి తెలిసినదే. అందుకే ఐక్యత శుభములను వదులు కొనుట వివేకుని కార్యము కాదు. ఈ దేశములో హిందువులు, ముస్లిములు  ఇరు  జాతుల వారున్నారు. ఏదో ఒకప్పుడు హిందువులు సంఘటితమై ముస్లిములను ఈ దేశము నుండి బహిష్కరించుట లేక ముస్లిములు ఏకమై హిందువులను దేశ భ్రష్టులను చేయడం అసంభవం. వాస్తవానికి ఇప్పుడు హిందువుల, ముస్లిముల మధ్య విడదీయరాని సంబంధమేర్పడుచున్నది. ఒకరికి ఏదేని ఆపద సంభవించినచో మరొకరు కూడ అందులో పాల్గొనును. ఒక జాతి గర్వము, అహంకారముతో మరొక జాతిని పరిహసించినచో ఆ జాతి కూడ పరిహాసమునకు గురగును. పొరుగింటి వారికి తను సహకరించనిచో తాను కూడ నష్టపోవును. మీ రెండు జాతులలో నుండి ఒక జాతి నాశమును కోరు వారి స్థితి తను కూర్చున్న కొమ్మను తానే నరుకుచున్న వ్యక్తి లాంటిదే. ఇప్పుడు మీరు విద్యావంతులైనారు. ఈర్ష్యను వదిలి ప్రేమానురాగం పెంచుకోవడం ఉత్తమం. ఉపేక్షను వదిలి పరస్పరం సహకరించుకొనుట వివేకమగును. ఈ ఇహలోక కష్టాలు ఎర్రగా మండుతున్న సూర్యుని తాపము లో ఎడారి ప్రయాణం లాంటివి. ఈ కఠినమైన దారి కొరకు, మండుతున్న అగ్నిని చల్లార్చుటకు, దాహం సందర్భమున మృత్యువు నుండి రక్షించుటకు సమైక్యత అను శీతల జలం అవసరం.

ఇటువంటి సున్నిత పరిస్థితిలో నేను మిమ్ములను సంధి కొరకు ఆహ్వానించుచున్నాను. నిస్సందేహంగా సంధి చేసికొనుట ఇరువురికి చాలా అవసరం. ప్రపంచము వివిధ కష్టాలతో అల్లకల్లోలమగుచున్నది. భూకంపాలు సంభవించుచున్నవి. కరువు ఏర్పడుతుంది. మహమ్మారి

(ప్లేగు) పూర్తిగా అంతము కాలేదు. ప్రపంచము తన దుష్చర్యలను వీడి, నేరములతో పశ్చత్తాపము చెందనిచో కఠిన, గంభీర ఆపదలు సంభవించునని అల్లాహ్ తఆలా నాకు వార్తనందించాడు. ఒక విపత్తు ముగియక ముందే మరొక విపత్తు సంభవించును. తుదకు ఇదేమి జరుగుతున్నదని మానవులు ఆపన్నులగుదురు. అనేకులు సంకటములలో చిక్కుకొని మతిస్తిమితం కోల్పోవుదురు. కావున ఓ మన దేశ సోదరులారా! దీపం ఆరక ముందే ఇల్లు చక్కబెట్టుకొను చందంలా ఆ రోజులు రాకముందే జాగ్రత్త పడుము. హిందువులు, ముస్లిములు సంయుక్తంగా సంధి కుదుర్చుకొనవలెను. సమైక్యతకు ప్రతికూలమైన వైఖరి ఏ జాతిలో నున్నను దానిని వదులుకొనవలెను. లేనిచో ఉభయ శత్రుత్వ నేరం మొత్తం ఆ జాతి పైనే పడును.

ఉభయుల మధ్య ధార్మిక విభేదముంది. అది దినదినము హృదయాలను దూరము చేస్తున్న తరుణంలో సంధికి అవకాశము ఎక్కడుందని ఎవరైనా ప్రశ్నించవచ్చును.

దీనికి సమాధానముగా నేనిలా తెలుపుదును. వాస్తవముగా వివేకము, నిజాయితీ, నిర్దిష్ట అంశాలపై వున్న విభేదమే ధార్మిక విభేదమనబడును. అవివేక, అవినీతి రహిత విషయాన్ని ఆచరించుటకే మానవునికి జ్ఞానం ప్రసాదించనైనది. జగత్ సత్యాలుగా పేరుపొందిన అంశాలకు ఇది విరుద్ధం కాకూడదు. చిన్న చిన్న విభేదాలు సంధికి ప్రతికూలం కాబోవు. ప్రసిద్ధిగాంచిన సందేశహరున్ని, దైవవాణితో కూడిన గ్రంథమును ఎగతాళితో, తిరస్కరించుచూ జరిపిన దాడి మాత్రమే సంధికి ప్రతికూలమగును.

ఇస్లాంలో గల విద్య, వేదాల విద్యలోని ఏదేని ఒక శాఖలో తప్పక యున్నదను విషయము సమైక్యత కోరువారి కొరకు హర్షించదగినదే.

వేదాల తర్వాత దైవ, సువార్తవాణి ముగిసిందని నూతన ధర్మము ఆర్య సమాజ నిబంధన. ఈ దేశములోనే కోట్లాది అనుచరులు కలిగిన సందేశహరులు అప్పుడప్పుడు హిందు ధర్మంలో అవతరించి, తమ సువార్తవాణి ప్రకటనతో ఈ ముద్రను తొలగించారు. ఈ దేశం, బెంగాల్‌లో గౌరవము, అభిమానముతో గుర్తింపు పొందిన అవతారుని పేరు శ్రీకృష్ణుడు. తాను సువార్తవాణి పొందినట్లు ప్రకటించుకొనెను. వారి అనుచరులు వారిని సువార్తవాణి పొందినట్లే గాక పరమేశ్వరుడని కూడ నమ్ముదురు. శ్రీ కృష్ణుడు తమ కాలపు ప్రవక్త, అవతారుడు. దేవుడు అతనితో సంభాషించేవాడను విషయములో సంశయం లేదు.

ఇలాగే ఈ తుది కాలములో హిందువుల జాతి నుండి బాబా నానక్ గారు అవతరించిరి. వారి గౌరవ ఖ్యాతి ఈ దేశమంతట వ్యాపించినది. వారిని అనుసరించు జాతి ఈ దేశములో 20 లక్షలకు తక్కువ లేని వీరు సిక్కులనబడుదురు. బాబా గారు తన జనం సాఖీల, గ్రంధములో స్పష్టంగా సువార్తవాణి పొందినట్లు ప్రకటన చేసిరి. ఇస్లాం ధర్మం సత్యమైనదని దేవుడు నాకు సువార్తవాణి ద్వారా తెలిపాడని కూడ వారు తమ జనం సాఖీలో వ్రాసిరి. అందుకే వారు హజ్ కూడ చేశారు. ఇస్లాం విశ్వాసాలను ఆచరించసాగారు. నిస్సందేహంగా వారి ద్వారా అద్భుతములు, చిహ్నములు కూడ వెలువడినవని రుజువైనది. నిస్సందేహముగా బాబా నానక్ గారు పుణ్యాత్ములు, సత్యమూర్తులు. దేవుడు తన ప్రేమ రసము అందించినవారిలో ఒకరు. ఇస్లాం దైవ ధర్మమని సాక్ష్యమిచ్చుటకే వారు హిందువులలో జన్మించారు. అతడు కలిమా لَآ اِلٰہَ اِلَّا اللّٰہُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰہِ గూర్చి సాక్ష్యమిచ్చినట్లు తెలుపుచున్న డేరా నానక్‌లో నున్న అతని శుభ వస్తువులను తిలకించిన వ్యక్తి, గురుహర్ సుహాయె జిల్లా ఫిరోజ్‌పూర్‌లో పవిత్ర ఖురాన్ తో సహా నున్న అతని

శుభ వస్తువులను సందర్శించిన వ్యక్తి చిత్తశుద్ధి లేని పండితులపై దాగివున్న రహస్యాన్ని బాబా నానక్ గారు తమ పవిత్ర హృదయం, పరిశుద్ధ స్వభావము, గొప్ప సాధనాల ద్వారా తెలుసుకున్నారని సంశయించడు. వారు సువార్తవాణి పొందినట్లు ప్రకటించి దైవ అద్భుతములు, చిహ్నములు బహిరంగపర్చి వేదాల తర్వాత సువార్తవాణి, చిహ్నాలకు అవకాశం లేదంటున్న విశ్వాసాన్ని గట్టిగా ఖండించి, రద్దుచేసిరి. నిస్సందేహంగా హిందువుల కొరకు బాబా నానక్ గారి ఆగమనం దైవ ప్రసాదముగా వుండెను. వారిని హిందు ధర్మ అంతిమ అవతారునిగా భావించవలెను. ఇస్లాం గురించి హిందువుల హృదయాలలో నున్న ద్వేషమును వారు దూరం చేయదలచినారు. కాని హిందూ మతస్తులు బాబా నానక్ గారి బోధనతో లబ్ధి పొందకపోవడం ఈ దేశపు దురదృష్టం. వారు ఇస్లాంను పదే పదే ఎందుకు ప్రశంసించుచున్నారని పండితులు వారికి బాధ కలిగించిరి. హిందు ధర్మం, ఇస్లాం మధ్య సంధి ఏర్పరచుటకు వారు అవతరించి యుండిరి. కాని వారి హితబోధను ఎవరూ శ్రద్ధగా వినలేదు. వారి ఉపదేశములను సద్వినియోగం చేసుకొని వుంటే నేడు హిందువులు, ముస్లిములందరు ఏకమైవుండే వారు. ఇలాంటి సత్యమూర్తి వచ్చెను, వెళ్ళిపోయెను. కాని అజ్ఞానులు వారి కాంతితో ఎలాంటి జ్యోతి పొందలేదను విషయము జ్ఞాపకము వచ్చినప్పుడు చింతించవలసి వస్తుంది.

సంక్షిప్త మూలమేమనగా దైవవాణి, అతని సంభాషణ ఎన్నడూ రద్దుకాదని, దైవ చిహ్నములు అతని సజ్జనుల ద్వారా ఎల్లప్పుడు ప్రత్యక్షమగుచుండునని వారు నిరూపించి పోయిరి. ఇస్లాంతో శత్రుత్వమనగా జ్యోతితో శత్రుత్వమని వారు సాక్ష్యమిచ్చి వెళ్ళిపోయిరి.

ఇలాగే దివ్యబోధన, దైవ సంభాషణ ఈ కాలములోను ఏమాత్రం రద్దు చేయబడలేదను విషయంలో నేను కూడ అనుభవజ్ఞుడినే. అల్లాహ్

తఆలా గతములో సంభాషించినట్లే ఇప్పుడు కూడ సంభాషించును. ఇంతకు ముందు వినునట్లే ఇప్పుడు కూడ వినును. అతని ప్రాచీన లక్షణములు ఇప్పుడు రద్దు కాలేదు. దివ్యబోధన, దైవసంభాషణతో నేను దాదాపు 30 సంవత్సరముల నుండి సత్కరించబడియున్నాను. నా ద్వారా అతడు వందలాది నిదర్శనములను ప్రత్యక్షపరచెను. వేలాది ప్రజల సాక్ష్యము, సమక్షములో అవి సంభవించినవి. పుస్తకములలో, పత్రికలలో ప్రచురితమైనవి. ఏదో ఒక నిదర్శనమునకు సాక్షిగా లేని జాతి లేదు.

ఇలాంటి నిరంతర నిదర్శనములున్నను ఆర్యా సమాజ్ బోధను అనవసరంగా వేదాలతో అంటగట్టడము ఆమోదయోగ్యమా ?. వారి వాదన ఏమనగా దివ్య బోధన, దైవ సంభాషణ వేదాలతోనే ముగిసింది, ఆ తర్వాత కేవలం కట్టుకథలే ఆధారం. వారు తమ ఇదే విశ్వాసాన్ని ఆసరాగా తీసుకొని వేదాలు తప్ప ప్రపంచములో దైవ గ్రంధాల పేరుతో నున్న గ్రంధములన్నియు మానవుని సృష్టి అని అంటున్నారు. (నవూజుబిల్లాహ్). ఆ గ్రంధములు వేదాల కంటే అధికంగా తమ సత్యనిదర్శనములు చూపుచున్నవి. దేవుని సహాయ, సహకార హస్తము వాటి వెంట వుంది. దేవుని అసాధారణ నిదర్శనములు వాటి విశ్వసనీయత పై సాక్ష్యమిచ్చుచున్నవి. మరి వేదాలను మాత్రమే దైవవాణి అనుట, ఆ గ్రంధాలను దైవవాణి కాదను వాదనకు కారణమేమిటి ? సత్యమేమనగా దేవుని ఉనికి అగాధమైనది, అతి గోప్యమైనది. కనుక తన ఉనికిని నిరూపించుకొనుటకు అతడు ఒక గ్రంధముపై ఆధారపడడని జ్ఞానము కూడ సూచించుచున్నది. వెంటనే సందేహాలలో చిక్కుకునే బలహీన మానవుడు దైవ స్వీకరణ అనుగ్రహమును కోల్పోకూడదని వివిధ దేశాలలో ప్రవక్తను ఎన్నుకొని తన సంభాషణతో వారిని సన్మానించెను.

శాంతి స్వభావము గల జ్ఞానము ఎలాంటి పరిస్థితిలో ఈ అంశాన్ని

స్వీకరించబోదు ఎందుకనగా అతడు అనంతసృష్టికి సృష్టికర్త. తమ సూర్యునితో తూర్పు, పడమరను ప్రకాశవంతము చేయును. ప్రతి దేశములో అవసరమున్న ప్రతి సమయమున తన వర్షముతో దాహాన్ని తీర్చును. అలాంటి దేవుడు మానవ ఆధ్యాత్మిక శిక్షణ విషయంలో లోభితనమును, సంకుచిత హృదయమును ఎలా ప్రదర్శించును. అతనికి శాశ్వతముగా ఒకే దేశము, ఒకే జాతి, ఒకే భాష ఎలా ఇష్టమైయుండును. పరమేశ్వరుడు ప్రతి వ్యక్తి తన భాషలో చేయుచున్న ఆరాధన, ప్రార్థనను అర్థం చేసుకొనును, అసహ్యించుకొనడు. కాని వేదాల భాష సంస్కృతము తప్ప మరో భాషలో సంభాషించుటకు అసహ్యించుకొను విషయము, తత్వజ్ఞానం నమ్మశక్యంగా లేదు. ఈ తత్వజ్ఞానం, వేదాల విద్య నేటి వరకు మానవుడు పరిష్కరించలేని సమస్యగా మిగిలిపోయెను.

వివేకముకు విరుద్ధముగా పరమేశ్వరునిపై లోభితనం, పక్షపాత ఆరోపణ సంధించే బోధన వేదాల్లోని ఏ పుటలో లేదని నా అభిప్రాయం. యదార్థమేమనగా ఒక దైవ గ్రంథము పై ఒక సుదీర్ఘ కాలము గడిచిన తర్వాత ఆ గ్రంథ అనుచరులు అజ్ఞానముతో లేదా స్వార్థాల కొరకు, అనాలోచితంగా లేదా ఆలోచితంగానే ఆ గ్రంథములో తామే అదనపు విషయాలను చేర్చుదురు. ఈ అదనపు విషయాలను ప్రవేశపరచు వారు విభిన్న అభిప్రాయాలు కలిగి వున్నందున ఒక ధర్మము నుండి వందలాది ధర్మములు జన్మించును.

ఆశ్చర్యకర విషయమేమనగా దైవవాణి శాశ్వతముగా ఆర్య వంశం, ఆర్య వర్గముకే పరిమితం. వేదాల భాష సంస్కృతము శాశ్వతముగా దైవవాణికి ప్రత్యేకం. అదే పరమేశ్వరుని భాష అని ఆర్యులు విశ్వసించినట్లే యూదులు కూడ తమ వంశం, గ్రంథము గురించి ఇటువంటి విశ్వాసాలు కలిగివున్నారు. అల్లాహ్ స్వంత భాష ఇబ్రాని

అని, దైవవాణి ఎల్లప్పుడు ఇస్రాయీల్ సంతతి, వారి దేశము వరకే పరిమితమని వారి అభిప్రాయం. వారి వంశం, వారి భాషకు సంబంధించని వ్యక్తి తాను ప్రవక్త అని ప్రకటించినచో అతడు నవూజుబిల్లాహ్ అసత్యుడని వారు విశ్వసించెదరు.

ఈ ఇరుజాతులు తమ తమ వాదనలో ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం ఆశ్చర్యకరం కాదా ! ఇలాంటి అభిప్రాయానికి కట్టుబడి వున్న వర్గములు ప్రపంచములో అనేకములు. ఉదాహరణకు పారసీకులు. వీరు కూడ వేదముల కంటే పలు కోట్ల సంవత్సరముల క్రితమే వీరి ధర్మము ప్రారంభమైనదని అంటుంటారు. కావున ఈ అభిప్రాయము (శాశ్వతముగా తమ దేశము, కుటంబము, తమ గ్రంధముల భాషను దైవవాణి, దైవసంబాషణతో ప్రత్యేకించడం) ఈర్ష్యతో, అవగాహన లోపం వల్లనే ఏర్పడిందని అర్థమవుతుంది. ఎందుకనగా ప్రాచీన యుగంలో ఒక జాతి పరిస్థితులు మరో జాతికి, ఒక దేశ స్థితిగతులు మరొాక దేశానికి తెలియకపోయేది. ఈ తప్పిదము వలన ప్రతి జాతి ఈశ్వరుని తరపున ఏదేని గ్రంధం లభించినచో లేక దైవప్రవక్త, సందేశహరుడు ఎవరైనా ఆ జాతిలో అవతరించినచో దేవుని తరపున వచ్చే మార్గదర్శనము ఆ జాతికే లభించినదని, దైవ గ్రంధము వారి కుటుంబానికి, వారి దేశానికి మాత్రమే లభించినదని ఇతరులందరు అనుగ్రహరహితులని ఊహించువారు.

ఈ అభిప్రాయము ప్రపంచానికి అపార నష్టం కలిగించింది. జాతుల మధ్య పరస్పరం ఈర్ష్య, అసూయల బీజము బలపడుటకు ఈ అభిప్రాయమే మూల కారణము. ఒక సుదీర్ఘ కాలము వరకు ఒక జాతి మరొాక జాతితో దాగివుండెను. ఒక దేశము మరొాక దేశముతో తెర వెనుక కనుమరుగైయుండెను. తుదకు హిమాలయ పర్వతముల అవతల ఎలాంటి ప్రాణి నివాసము లేదని ఆర్యులు భావించువారు.

ఆ తర్వాత దేవుడు మధ్యలో నున్న తెరను తొలగించెను. భూ నివాసము గురించి ప్రజలకు అవగాహన పెరిగింది. ఒకప్పుడు దివ్యవాణి గ్రంథముల, తమ అవతారుల, ప్రవక్తల గురించి తప్పుడు ప్రత్యేకతలు (విశిష్టతలు) ఊహించుకొనినందులకు అవి వారి హృదయాలలో గట్టిగా పాతుకొని శిలక్షరాల్లా దృఢమైపోయినవి. దేవుని కేంద్ర స్థానము శాశ్వతముగా తమ దేశమేనని ప్రతి జాతి ఊహించుకుంది. ఎందుకనగా అప్పుడు అధిక జాతులు జంతు లక్షణాలకు లోబడి యుండెను. ప్రాచీన ఆచార వ్యతిరేకునికి ఖడ్గముతో సమాధానమిచ్చేవారు. ప్రతి జాతి స్వగర్వ ఉత్సాహాన్ని శాంతింపచేసి వారి మధ్య సంధి ఏర్పాటుకు ఎవరూ సాహసించేవారు కాదు. గౌతమ బుద్ధుడు ఈ సంధి కొరకు సంకల్పించెను. వేదమే సర్వం వాటి తర్వాత ఏమి లేదు అనే అభిప్రాయానికి అతడు విరుద్ధుడై యుండెను. అతడు జాతి, దేశము, వంశ ప్రాముఖ్యతలను విశ్వసించేవాడు కాదు. అనగా వేదముపైనే పూర్తి ఆధారం అనునది అతని ధర్మం కాదు. ఈ భాషే, ఈ దేశమే, ఈ బ్రహ్మణులే దైవ సంభాషణము కొరకు అతని న్యాయస్థానంలో శాశ్వతముగా పట్టా పొందలేదు. అతను ఈ విభేదము ఎత్తి చూపినందున అనేక కష్టాలు ఎదుర్కొనెను. అతడు దైవ అవిశ్వాసుడు, నాస్తికుడని పిలువబడెను. ఈ కాలములో ఐరోపా, అమెరికా ప్రాంతాలలో హజ్రత్ యేసు క్రీస్తు దైవత్వాన్ని స్వీకరించని, దేవునికి శిలువ శిక్ష విధించరాదని విశ్వసించుచున్న పరిశోధకులందరు క్రైస్తవ మత గురువుల దృష్టిలో దైవ తిరస్కృతులే.

ఇదే విధముగా బుద్ధుని పై కూడ దైవ అవిశ్వాసుడని ముద్ర పడింది. సామాన్య ప్రజలు అతన్ని అసహ్యించు కొనుటకు సంప్రదాయం ప్రకారం దుష్టులైన విరుద్ధులు అతని పై అనేక ఆరోపణలు చేశారు. ఫలితంగా అతని స్వదేశమైన ఆర్యా వరత్ నుండి బుద్ధుడు బహిష్కరించ

బడెను. ఇప్పటి వరకు కూడ హిందువులు బౌద్ధ ధర్మమును, దాని విజయాన్ని అసహ్యంగా, నీచముగా భావిస్తారు. కాని హజ్రత్ యేసు క్రీస్తు వాఖ్యము ప్రకారము "సందేశహరుడు స్వదేశములోనే మర్యాదలేని వాడగును" బుద్ధుడు ఇతర దేశానికి వలసవెళ్ళి గొప్ప విజయాన్ని సాధించెను. ప్రపంచములోని మూడవ భాగము బౌద్ధ ధర్మముతో నిండివున్నదని ప్రజలు తెలుపుచున్నారు. అధిక అనుచరుల ప్రకారము దీని అసలు కేంద్రము చైనా, జపాన్ అయినను ఇది దక్షిణ రష్యా, అమెరికా వరకు విస్తరించింది.

మరల మేము అసలు అంశము వైపు దృష్టి మళ్ళించుచు వ్రాయునదేమనగా ఒక ధర్మము మరో ధర్మము గురించి తెలియని కాలమున ప్రతి జాతి తమ ధర్మం, తమ గ్రంధముపై ఆధారపడుట సహజమే. ఈ ఆధారం వలన వచ్చిన ఫలితమేమనగా ఒక దేశము ఇతర దేశ ఉనికి తెలిసికొని, వివిధ దేశాల ప్రజలు పరస్పర ధర్మము గురించి తెలుసుకొనిన వేళ ఒకరి ధర్మాన్ని మరొకరు ధృవీకరించలేని క్లిష్టమైన సంక్షోభం తలెత్తెను. ఎందుకనగా ప్రతి ధర్మం కొరకు కవిత్వ రూపంలో అతిశయోక్తి ద్వారా ప్రత్యేకతలు, ప్రాముఖ్యతలు, జోడించిన విషయాలను దూరము చేయుట సులభం కాదు. ఇందు మూలంగా ప్రతి ధర్మ అనుచరులు ఇతర ధర్మాన్ని ఖండించుటకే సిద్ధమైరి. జింద్ వాస్తా ధార్మికులు "మేమే, మేము తప్ప మరెవ్వరూ లేరు". అనే నినాదాన్ని చాటుకున్నారు. ప్రవక్తృత్వ పరంపరను తమ కుటుంబము వరకే పరిమితం చేసిరి. తమ ధర్మ చరిత్రను వేదాల చరిత్రలు తలదించుకునే స్థాయికి పొడిగించిరి.

ఇటు ఇబ్రానీ ధార్మికులు దైవ సింహాసనాన్ని శాశ్వతముగా సిరియా దేశానికే పరిమితం చేయుచు హద్దులు దాటిరి. దేశ సంస్కరణ కొరకు

శాశ్వతముగా వారి వంశ సజ్జనులే నియమింపబడుదురని నిర్ధారించిరి. కాని దైవాదేశానుసారము ఆ సంస్కరణ కేవలం ఇస్రాయీల్ సంతతి వరకే పరిమితమయ్యెను. వారి వంశం వరకే దైవవాణి, సువార్తవాణి పరిమితమై ఇతరులెవరైనను నిలిచినచో అతడు అసత్యుడనబడెను.

ఇస్రాయీల్ సంతతి వారి మాదిరిగానే ఆర్యా వరత్ వారి అభిప్రాయాలు కూడ ప్రచురితమైనవి. వారి విశ్వాసం ప్రకారము పరమేశ్వరుడు వారికే రాజు. ఆ రాజుకు ఇతర దేశాల విషయమే తెలియదు. పరమేశ్వరుడు మొదటి నుండే ఆర్యా వాతావరణమునే ఇష్టపడ్డాడని, అతడు పుట్టించిన ఇతర దేశస్తులను దర్శించి పరామర్శించుటకు అతడు ఎన్నడూ ఇష్టపడలేదను నిదర్శన రహిత నమ్మకమును వారు కలిగియున్నారు.

మిత్రులారా ! దైవ సాక్షిగా ఆలోచించగలరు ! మానవ సహజ స్వభావము, ఆలోచనా శక్తి ఇటువంటి విశ్వాసాలను స్వీకరించగలదా ! దేవుడు సర్వలోకానికి సంరక్షకుడని వాదించుచు అదే నోట అతడు సర్వలోకాన్ని పోషించే శక్తి రహితుడని, ఒక ప్రత్యేక జాతి, ఒక ప్రత్యేక దేశము పైనే అతను దయ చూపుచున్నాడని ఏ విధంగా వ్యాఖ్యానించు చున్నారో నాకు అంతు పట్టడం లేదు. మేధావులారా !! స్వయంగా తమరే న్యాయం చెప్పండి. దేవుని శారీరక ప్రకృతిలో ఎక్కడైనా ఇటువంటి సాక్ష్యం లభించునా! లభించనప్పుడు అతని ఆధ్యాత్మిక చట్టంలో ఈ పక్షపాతం ఎందుకు కనిపించుచున్నది.

వివేకమును ఉపయోగించినచో ప్రతి కార్యపు మంచి, చెడు ఫలితమును తెలుసుకొనవచ్చును. విభిన్న సామాజిక వర్గాలకు చెందిన కోట్లాది మానవులు బానిసలుగా, విధేయులుగా నున్న ఆ మహోన్నత సందేశహరులను అగౌరవపర్చుట, వారిని దుర్భాషలాడుట వలన వచ్చే

ఫలితమేమిటో, అంతిమంగా ఎటువంటి తీవ్ర పరిణామాలు ఎదురవునో నేను వివరించవలసిన అవసరం లేదు. ఎందుకనగా ఇటువంటి ఫలితంలోని ఎంతో కొంత రుచి చూడని జాతి లేదు.

ఓ ప్రియులారా ! ప్రాచీన అనుభవము, పదేపదే జరిగిన పరీక్ష నిరూపించినదేమనగా వివిధ జాతుల ప్రవక్తల, సందేశహరులను అమర్యాదతో ప్రస్తావించుట, వారిని దుర్భాషలాడుట ఒక విషం లాంటిది. దీని ఫలితంగా కేవలం శరీరమే కాదు, ఆత్మ కూడ నాశనమగును అంతేగాక ఇహలోకం పరలోకం రెండూ నాశనమగును. ఒకే దేశస్తులు పరస్పరం ధార్మిక మార్గదర్శకులను కించపరుస్తూ, వారి ఉన్నత స్థానాన్ని దిగజార్చుటలో నిమగ్నమైనచో ఆ దేశం శాంతియుతంగా నివసించలేదు. ఒక జాతి లేదా ఇరు జాతులు ఒకరు మరొకరి ప్రవక్త, సందేశహరుడు, అవతారున్ని అమర్యాద పదజాలంతో దూషించినపుడు ఆ ఇరుజాతులలో నిష్కపటమైన ఐక్యత ఏర్పడదు. తమ ప్రవక్త, మార్గదర్శకుని అవమానము విని ఎవరికి ఆవేశము రాదు ! ప్రత్యేకంగా ముస్లిం జాతి తమ ప్రవక్తను దేవుడు లేదా దేవుని కుమారుడని విశ్వసించదు. కాని తల్లి గర్భము నుండి జన్మించిన మానవులందరిలో ఉత్తముడని వారు విశ్వసింతురు. కావున వారి పవిత్ర ప్రవక్త ప్రస్తావన సందర్భమున గౌరవముతో పవిత్ర పదాలతో గుర్తించనిదే ఒక స్వచ్ఛమైన ముస్లిం వ్యక్తితో సంధి కుదుర్చుకొనుట అసాధ్యం.

ఇతర జాతుల ప్రవక్తల గురించి మేము అవమానకరంగా సంభాషించము. మా విశ్వాసం ప్రకారం ప్రపంచములో విభిన్న జాతులలో అవతరించిన ప్రవక్తలను కోట్లాది ప్రజలు విశ్వసించారు. ప్రపంచములోని ఏదో ఒక ప్రదేశములో వారి ప్రేమ, గౌరవము వెలిసింది. ఈ ప్రేమ, విశ్వాసంపై సుదీర్ఘ కాలము కూడ గడిచింది. ఈ ఒక్క నిదర్శనమే వారి

సత్యానికి సాక్ష్యము. వారు దేవుని వైపు నుండి కానిచో కోట్లాది ప్రజలు వారిని స్వీకరించువారు కాదు. దేవుడు తన ప్రియమైన దాసుల గౌరవమును ఇతరులకు అందించడు. ఎవరైన అసత్యుడు వారి ఆస్థానముపై కూర్చొనుటకు సాహసించినచో అతడు శరవేగంగా నాశనమై, అంతమైపోవును.

ఈ కారణంగానే మేము వేదములను దైవ గ్రంధములని విశ్వసింతుము. వేదాల బోధన సంపూర్ణ రీతిలో ఏదేని ఒక వర్గమును దైవ ఆరాధకులుగా మార్చలేదు, మార్చే స్థితిలో కూడ లేకుండెనను విషయము మేము గమనించినను దాని రిషీలను, సజ్జనులను, పవిత్రులుగా భావించెదము. ఈ దేశములోని విగ్రహారాధన, అగ్నిపూజ, సూర్యపూజ. గంగాపూజ చేయువారు లేదా వేలాది దేవతల పూజారులు, జైన మతము, షాకిత్ మతము వారందరు తమ ధర్మములను వేదముతోనే అనుసంధానిస్తారు. వేదము ఒక సంక్షిప్త గ్రంధమైనందున ఈ వర్గములన్నియు ఇందులో నుండే తమ ఉద్దేశాలను వెలికితీస్తాయి. అయినను దైవ ఉపదేశానుసారము వేదము మానవ సృష్టికాదని మా దృఢ విశ్వాసము. కోట్లాది ప్రజలను తమ వైపు మల్లించుకొని, ఆపై ఒక శాశ్వత పరంపరను కొనసాగించే శక్తి సామర్థ్యం మానవ సృష్టికి యుండదు. వేదములో శిల్ప పూజ గురించి మేము ఎక్కడా చదవలేదు. కాని అగ్ని, వాయు, జలం, చంద్రుడు, సూర్యుని పూజలతో వేదము నిస్సందేహముగా నిండియున్నది. ఏ శ్లోకములో వీటి పూజను నిషేధించలేదు. హిందు మతములోని పూర్వ వర్గములన్నియు అసత్యము, కేవలము నూతన ఆర్య వర్గము మాత్రమే స్వచ్ఛమైనదని ఎవరు తీర్పు చెప్పగలరు. వేదముల సూచన మేరకు ఈ వస్తువులను ఆరాధించుచున్న వారి వద్ద గట్టి నిదర్శనముంది. అనగా ఈ వస్తువుల ఆరాధన వేదములో స్పష్టముగా

వుంది కాని నిషేధమెక్కడా లేదు. ఇవన్ని పరమేశ్వరుని నామములని వాదించడం ఒక దావా మాత్రమే కాని నిరూపించబడలేదు. ఒక వేళ తీర్మాణం జరిగి వుంటే 30, 35 సంవత్సరముల నుండి ప్రగాఢ కృషి జరిగినను బనారస్, ఇతర పట్టణాల మహా పండితులు, హిందువులు అల్ప సంఖ్యలో మాత్రమే ఆర్య ధర్మాన్ని స్వీకరించారు. సనాతన ధర్మము, ఇతర హిందువుల వర్గములతో పోల్చి చూస్తే ఆర్య ధార్మికులు అతి స్వల్ప సంఖ్యలో వున్నందున అసలు లేరనే భావన కలుగుతుంది. ఇతర హిందు ధర్మములోని వర్గములపై వీరి ప్రభావం ఏ మాత్రము లేదు. నియోగ్ లాంటి బోధనను వేదముతో ముడిపెట్టుట, ఆ విద్యను మానవ జాతి అభిమానము, సభ్యత స్వీకరించలేదు. కాని నేనింతకు ముందు తెలిపిన విధముగా ఇది వేదము నేర్పిన బోధన అని మేము నమ్మలేము. ఈ బోధనలన్నియు మానవ స్వార్థం కొరకు తరువాత వేదములో విలీనం చేయబడినవని సదుద్దేశము మాకు గట్టిగా తెలుపుచున్నది. వేదాలపై వేలాది సంవత్సరములు గడిచినవి. కావున విభిన్న కాలములలో వేదాల ఉపన్యాసకులు అనేక మార్పులు, చేర్పులు చేసివుంటారు. కోట్లాది ఆర్యులు వేల సంవత్సరముల నుండి వేదమును దైవ గ్రంథముగా విశ్వసించుచున్నారు. మా అభిప్రాయం మేరకు ఈ ఒక్క నిదర్శనమే వేదము దైవ గ్రంథమనుటుకు సరిపోవును. ఒక అసత్యుని బోధనకు ఇటువంటి గౌరవము లభించుట అసాధ్యం.

కావున ఇచట గమనించవలసినదేమనగా మేము ఇన్ని అడ్డంకులను వీడి దైవ భీతితో వేదము దైవ గ్రంథమని అభిప్రాయపడు చున్నాము. దాని బోధనలో కనిపించుచున్న లోపాలను వేద వక్తల తప్పిదములని భావించుచున్నాము. పవిత్ర ఖుర్ఆన్ ఆరంభము నుండి అంతము వరకు దైవ ఏకత్వముతో పరిపూర్ణమైయున్నది. ఏ ఒక్క

సందర్భమున కూడ సూర్య, చంద్ర ఆరాధనను ప్రోత్సహించు ఆదేశము ఇందులో లేదు. لَا تَسْجُدُوا لِلشَّمْسِ وَلَا لِلْقَمَرِ وَاسْجُدُوا لِلَّهِ الَّذِي خَلَقَهُنَّ (హామీం అస్సజ్దహ్:38) అనగా "సూర్యునికి గాని, చంద్రునికి గాని, ఏ ప్రాణిని పూజించకుము. వాటిని పుట్టించిన వానిని పూజించుము" అని స్పష్టముగా తెలిపినది. ఇంకను పవిత్ర ఖురాన్ దేవుని ప్రాచీన చిహ్నములు, నూతన నిదర్శనముల సాక్ష్యము కలిగియుంది. దైవ ఉనికిని చూపుటకు ఇదొక దర్పణం. మరెందుకు దీని పై క్రూర దాడులు చేయబడుచున్నవి. మేము ఆర్యులతో వ్యవహరించునట్లు మాతో ఎందుకు వ్యవహరించబడదు. దేశములో శత్రుత్వ బీజమెందుకు నాటబడుచున్నది. ఇట్లు సత్ఫలితము వచ్చునని ఆశించుచున్నారా ! పుష్పమందించిన వారిపై రాయిని విసురుట మంచి వ్యవహారమా ! పాలు సమర్పించిన వ్యక్తిపై మూత్రము విసర్జించుట సమంజసమేనా !

మా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను దేవుని సత్యమైన ప్రవక్తగా గౌరవనీయులైన హిందువులు, గౌరవనీయులైన ఆర్యులు విశ్వసించి వారిని అవమానించుట, తిరస్కరించుట వదిలి ఒక సంపూర్ణ సంధి ఒప్పందము కుదుర్చుకొనుటకు సిద్ధమైనచో అందరి కంటే ముందు నేను ఆ ఒప్పంద పత్రము పై సంతకము చేయుదును. మేము అహ్మదియ్య సంస్థ ప్రజలు ఎల్లప్పుడు వేదమును ధ్రువీకరించెదము. వేదము, దాని అవతారులను గౌరవము, అభిమానముతో గుర్తించెదము. దీని ప్రకారము ఆచరించనిచో ఒక భారీ నగదు జరిమానా అనగా మూడు (3) లక్షల రూపాయలు హిందువులకు చెల్లింతుము. గౌరవనీయులైన హిందువులు కూడ హృదయపూర్వకంగా మాతో సంధికి సిద్ధమైతే వారు కూడ ఇలాంటి ఒప్పందము వ్రాసి సంతకము చేయవలెను. వారి వ్యాసమిలా వుండవలెను. మేము హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వమును,

అవతారమును విశ్వసించుచున్నాము. వారిని సత్యమైన సందేశహరుడు, ప్రవక్తగా భావించుచున్నాము. భవిష్యత్తులో సగౌరవము, అభిమానముతో ఒక అవతారునికి తగినట్లుగా వారిని గుర్తించెదము. మేమీ ఆచరణలో విఫలమైనచో మూడు (3) లక్షల రూపాయలకు తక్కువ లేని భారీ నగదు జరిమానా అహ్మదియ్య సంస్థ నాయకునికి  సమర్పించెదము.

మా అహ్మదియ్య సంస్థ ఇప్పుడు 4 లక్షల కంటే తక్కువ లేదని గుర్తుంచుకొనవలెను. కావున ఇటువంటి పెద్ద కార్యానికి మూడు లక్షల రూపాయల చందా పెద్ద విషయం కాదు. మా సంస్థలో నేటికి చేరని వారు వాస్తవముగా ఏకాభిప్రాయము, ఏకాగ్రత రహితులు. వారి దృష్టిలో అనివార్య విధేయత గల నాయకుడు వారికి లేదు. అందుకే నేను వారి గురించి ఏమియును చెప్పలేను. ఇప్పుడైతే వారు నన్ను కూడ అవిశ్వాసుడు, దజ్జాల్ అంటున్నారు. కాని గౌరవనీయ హిందువులు నాతో ఇటువంటి ఒప్పందము కుదర్చుకున్నచో వారు కూడ ఎలాంటి అసమంజస కార్యానికి పాల్పడరని ఆశించుచున్నాను. ఎందుకనగా ఇటువంటి సభ్యతగల జాతి గ్రంధమును, అవతారులను చెడు పదాలతో గుర్తించి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను దుష్పదాలతో ప్రస్తావించేటట్లు ప్రవర్తించరు. ఇటువంటి దుర్భాషలు ఈ కార్యానికి పాల్పడిన వారికే తిరిగి కలుగును. ఎందుకనగా ఈ చర్య లజ్జ, నైతికతకు విరుద్ధమైనది. అందుకే ఈ ఒప్పందం  తర్వాత వారు దుర్భాషలాడుతారని నేనూహించడం లేదు. కాని ఈ ఒప్పంద పత్రమును బలపరుచుటకు ఇరు పక్షాన పది పది వేల మేధావులు దాని పై సంతకము చేయుట అనివార్యమగును.

ప్రియులరా ! సంధి లాంటిది మరొకటి లేదు. ముందుకు రండి. మనము ఈ ఒప్పందము ద్వారా ఏకమవుదాము. ఒక జాతిగా ఆవిర్భవించుదాము. పరస్పర తిరస్కరణ వలన  చీలిక ఏర్పడెను. దేశానికి

ఎంతవరకు నష్టం వాటిల్లుతుందో తమరు చూస్తున్నారు. పరస్పర ధ్రువీకరణలో ఎన్నో అనుగ్రహములున్నవి కావున దీనిని కూడ పరీక్షించుటకు ముందుకు రాగలరు. సంధికి ఇదే ఉత్తమ మార్గం. మరో విధంగా సంధి కుదుర్చుకొనుట అంటే నిగనిగలాడుచున్న పుండును అదే స్థితిలో వదిలి వేయుటయే. దాని బహిర్గత మెరుపును చూసి సంతోషించుటయే. కాని వాస్తవముగా లోపల కుళ్ళిన, దుర్వాసనగల చీము వున్నది.

నేడు హిందువులు, ముస్లిముల మధ్య రగులుతున్న దాంబికము, వివాదము ధార్మిక విభేదాల వరకు పరిమితం కాదని ఇచట వ్రాయుట నా ఉద్దేశం కాదు. నిస్సందేహంగా ఇతర ఉద్దేశాలే ఇందుకు కారణం. ఇవి ఇహలోక కోరికలు, సమస్యలకు సంబంధించినవి. ఉదాహరణకు ప్రభుత్వ, దేశ పరిపాలనలో వారికి అధికారముండవలెనని లేదా కనీసం దేశ నిర్ణయాలలో వారి అభిప్రాయము తెలిసికొని వారి ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా వినవలెనని ఉన్నత పదవులు ఆంగ్లేయుల మాదిరిగా వారికి కూడ లభించవలెనని మొదటి నుండే హిందువులు కోరుచున్నారు. హిందువుల ఈ ప్రయత్నాలలో భాగస్వాములు కాకపోవడం ముస్లిముల తప్పిదము. మేము సంఖ్యాపరంగా తక్కువ వున్నామని వారు భావించారు. అయినను ఈ సర్వ ప్రయత్నాల ప్రయోజనం హిందువులకే లభిస్తుందని ముస్లిములకు కాదని వారు ఊహించారు. కావున భాగస్వామ్యముతో దూరముండుటయే గాక హిందువుల ప్రయత్నాలను వ్యతిరేకించి అడ్డుకున్నారు. అందువలన ఉద్రిక్తత రెట్టింపైనది.

ఈ కారణాల వలన కూడ మూల శత్రుత్వము పెరిగిందని నేను అంగీకరించుచున్నాను. కాని ప్రధాన కారణాలు ఇవేనని నేను ఏ మాత్రం ఒప్పుకోలేను. హిందూ, ముస్లిముల మధ్య శత్రుత్వము, దాంబికమునకు

కారణం ధార్మిక విభేదాలు కాదు ప్రధాన వివాదాలు రాజకీయ పరమైనవని ప్రకటించుచున్న వారి వాదనతో కూడ నేను ఏకీభవించలేను.

తమ న్యాయమైన హక్కులను పొందుటకు ముస్లిములు హిందువులతో కలిసి పోరాడుటకు ఎందుకు భయపడుచున్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరు సులభంగా అర్థం చేసుకోగలరు. వారు కాంగ్రెస్‌లో ప్రవేశించుటకు ఇప్పటి వరకు ఎందుకు నిరాకరించారు. తుదకు హిందువుల సమంజసమైన అభిప్రాయాన్ని గుర్తించి అనుసరించిరి. మరల వారితో విడిపోయి వారికి భిన్నంగా ఒక ముస్లిం సంస్థను స్థాపించారు, కాని వారి భాగస్వామ్యాన్ని స్వీకరించలేదు.

మహాశయులారా ! నిశ్చయముగా దీని ప్రథమ కారణం ధర్మమే. ఇది తప్ప మరొకటి కాదు. నేడు ఆ హిందువులే కలిమా తయ్యిబహ్ لَا إِلٰهَ إِلَّا اللهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللهِ చదివి ముస్లిములను ఆలింగనము చేసుకుంటే, లేదా ముస్లిములు హిందువులుగా మారి అగ్ని, వాయు పూజ వేదాల ఆదేశానుసారము ప్రారంభించినచో లేదా ఇస్లాంను వీడినచో ఇప్పుడు రాజకీయ వివాదములుగా భావించబడుచున్నవి గతంలో లేని విధంగా క్షణంలో అదృశ్యమైపోవును.

ఈ ఆవేశము, ఈర్ష్యలన్నిటికి మూల కారణం ధార్మిక విభేదమేనని స్పష్టమయింది. ఈ ధార్మిక విభేదమే తారా స్థాయికి చేరి రక్తపు నదులు ప్రవహింపజేసినది. ఓ విశ్వాసులారా! ధార్మిక వ్యతిరేకతల వలన మిమ్ములను హిందువులు వేరే జాతిగా గుర్తించిరి. అందుకు మీరు కూడ వారిని వేరే జాతిగా భావించిరి. మీలో ఈ సమస్య పరిష్కరించబడనంత వరకు పరస్పరం ఎలా స్వచ్ఛమైన మైత్రి ఏర్పడును. కపటముతో పలు దినముల వరకు కలిసియుండవచ్చును. కాని హృదయపూర్వక మైత్రి ఏర్పడుటకు మీరు వేదము, వేదాల ఋషులను మనస్ఫూర్తిగా దేవుని

వైపు నుండి వచ్చినవారని స్వీకరించుట తప్పనిసరి. అప్పుడు హిందువులు కూడ తమ కపటమును వీడి మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వమును ధ్రువీకరింతురు. బాగుగా గుర్తుంచుకొనుము! కేవలము ఈ ఒక్క నిబంధన మాత్రమే మీలో, హిందువులలో ఐక్యత, సయోధ్య ఏర్పరచుటకు దోహదపడునని జ్ఞాపకముంచుకొనుము!! ఈ జలమే కపటములను నిర్మూలించును. ఈ విడిపోయిన ద్విజాతులు పరస్పరం ఏకమయ్యే దినములు వచ్చినచో మా హృదయాలను తెరచినట్లు దేవుడు వారి హృదయాలను కూడ తెరచివేయును.

కాని దీనితో పాటు హిందువులతో హృదయపూర్వక సానుభూతి తో మెలుగవలెను. ఆప్యాయత, అనురాగము అలవరచుకొనుము. వారికి దుఃఖము కలిగించు కార్యముల నుండి దూరముండుము. కాని అటువంటి కార్యములు మన ధర్మములో విధిగా పాటించవలసిన నిబంధనలోనివి కాకూడదు. మహాశయులైన హిందువులు హృదయపూర్వకంగా మన సందేశహరుడు సల్లల్లాహు అలైహి వసల్లంను సత్యమైన ప్రవక్తగా నమ్మి, విశ్వసించినచో గోవు వలన ఏర్పడిన ఈ విభేదమును దూరము చేయవచ్చును. నిషేధించబడని వస్తువులు అనేకములు. కాని వాటన్నిటిని మేమెన్నడు ఉపయోగించలేదు. మరి దీనిని కూడ తప్పక ఉపయోగించ వలెనని ఎక్కడా లేదు. వారితో దయ, ఉపాకారముతో వ్యవహరించవలెనని మా ధర్మ ఆదేశాలలోని ఒక ఆదేశము. దేవుడు ఒక్కడేనని ఎవరూ అతనికి సమానులు కారని విశ్వసించుట మూలసూత్రం. ఒక అత్యవసర, శ్రేయస్కర కార్యము కొరకు అనవసర విషయాన్ని వీడుట దైవ శాసనానికి విరుద్ధము కానే కాదు. నిషిద్ధము కానిదని భావించుట వేరే విషయము, దానిని ఉపయోగించుట వేరే విషయము. దేవుడు నిషేధించిన వాటిని వదులుట, అతని ఇష్టానుసారము ఆచరించుటకు పరుగెత్తడమే ధర్మం.

అతని అనంతసృష్టితో దయ, సభ్యతగా వ్యవహరించుట, పరస్పర సహాకారముతో వుండుట. ప్రపంచములోని పవిత్ర ప్రవక్తలు, అవతారులందరిని వారి వారి కాలములో దైవ ప్రవక్తలు, సవరణకర్తలుగా నమ్ముట, వారిలో విభేదాలు సృష్టించకుండా ప్రతి మానవునితో సేవా దృక్పథంతో ప్రవర్తించుటయే మా ధర్మ సారాంశము. దైవ భీతి కోల్పోయి అన్యాయముగా మా అత్యుత్తమ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అసభ్యకర పదజాలముతో కూడిన ఆరోపణలు చేయుట వదలని వారితో మేమెలా సంధి కుదుర్చుకోగలము. నిశ్చయముగా నిర్భయముగా నేను వ్యక్తపరచునదేమనగా భూభాగంపై నున్న సర్పములతో, వన తోడేళ్ళతో సంధి చేయగలము కాని మా తల్లిదండ్రుల కంటే అధిక ప్రియమైన మా ప్రవక్త పై అపవిత్ర దాడులు చేసేవారితో మేము శాంతి ఒప్పందము చేసుకోలేము. ఇస్లాం అడుగుజాడల్లో దేవుడు మాకు మరణము ప్రసాదించుగాక ! విశ్వాసమును కోల్పోవు ఏ కర్యాము మేము చేయలేము.

నేనిప్పుడు ఏదో ఒక ప్రత్యేక జాతిని అనవసరంగా నిందించ దలచుకోలేదు. ఎవరిని దుఃఖించదలచలేదు. కాని తీవ్ర విచారంతో చెప్పవలసి వచ్చుచున్నదేమనగా ఇస్లాం పవిత్రమైనది, శాంతియుత ధర్మము. ఏజాతి నాయకునిపై దాడి చేయలేదు. జాతుల మధ్య శాంతికి పునాదులు వేసినటువంటి గౌరవార్హత గల గ్రంథము పవిత్ర ఖుర్‌ఆన్. ప్రతి జాతి ప్రవక్తను అది విశ్వసించెను. ఈ గర్వము ప్రపంచములోకెల్లా పవిత్ర ఖుర్‌ఆన్‌కే ప్రత్యేకం. ప్రపంచమును గురించి మనకిచ్చిన బోధన ఏమనగా لَا نُفَرِّقُ بَيْنَ اَحَدٍ مِّنْهُمْ وَنَحْنُ لَهٗ مُسْلِمُوْنَ (ఆలె ఇమ్రాన్:85) అనగా ఓ విశ్వాసులారా ! “ఇట్లు ప్రకటించుము ! మేము ప్రపంచములోని ప్రవక్తలందరిని విశ్వసింతుము. వారిలో కొందరిని విశ్వసించి కొందరిని

తిరస్కరించి వారిలో భేదమును సృష్టించము". ఇలాంటి శాంతియుత దైవ గ్రంధము మరొక్కటి వుంటే దాని పేరు వెళ్ళడించుము. దైవ సహజమైన కృపను పవిత్ర ఖుర్ఆన్ ఒక ప్రత్యేక వంశానికి కేటాయించలేదు. ఇసార్రయీలు వంశ ప్రవక్తలు యాఖూబ్ అలైహిస్సలాం, ఇస్హాఖ్ అలైహిస్సలాం, మూసా అలైహిస్సలాం, దావూద్ అలైహిస్సలాం, ఈసా అలైహిస్సలాం అందరి ప్రవక్తృత్వమును ధ్రువీకరించెను. ప్రతి జాతి ప్రవక్త, అతడు భారత్‌లో అవతరించినను, పారసీక దేశములో వచ్చినను ఎవరిని మోసగాడు, అసత్యుడని నిందించలేదు. ప్రతి జాతి, పట్టణములో ప్రవక్తలు అవతరించారని స్పష్టంగా వెల్లడించింది. సర్వజాతుల సంధికి పునాది వేసింది. కాని చింతించదలచిన అంశమేమనగా ఈ శాంతి దూతను ప్రతి జాతి దుర్భాషలాడుచు అలక్ష్యముతో చూస్తుంది.

ఓ స్వదేశీ స్నేహితులారా ! మిమ్ములను బాధ పెట్టుటకు గాని, మీ హృదయాలను గాయపర్చుటకు గాని నేనీ వ్యాసమును మీ ముందు ప్రవేశపెట్టలేదు. సదుద్ధేశముతో నేను చెప్పదలచిన విషయమేమనగా ఏ జాతులైతే ఇతర జాతుల ప్రవక్తలను అసభ్యకర పదజాలంతో దూషించుట తమ ధర్మంలోని అంశమని, ఎలాంటి నిదర్శనము లేనిదే అనవసరముగా జోక్యం కలిగించుకొనిన వారు దేవుని దృష్టిలో నేరస్తులుగా పరిగణింప బడుదురు. అంతేగాక మానవులలో వైరము, శత్రుత్వ బీజము నాటుటకు కారకులగుదురు. నిదానంగా ఆలోచించి సమాధానమివ్వుము. ఒక వ్యక్తి మరొకని తండ్రిని తిట్టినచో లేదా అతని తల్లిపై నిందమోపినచో అతడు తమ తల్లిదండ్రులపై దాడి చేసినట్లు కాదా ! తిట్టిన వాడు, తిట్లు తిన్నవాడు పరస్పరము నిందించుకొనినచో ఈ కార్యమునకు మొదలు తిట్టిన వాడు కారకుడు కాడా ? అప్పుడు తమ తల్లిదండ్రుల గౌరవ మర్యాదలను మంటగలిపినవాడు కాడా ? ఆలోచించుము.

పవిత్ర ఖుర్‌ఆన్‌లో దేవుడు మనకు గౌరవమర్యాదలు, సత్ప్రవర్తన నేర్పుచు ఇట్లనును. وَلَا تَسُبُّوا الَّذِينَ يَدْعُونَ مِن دُونِ اللَّهِ فَيَسُبُّوا اللَّهَ عَدْوًا بِغَيْرِ عِلْمٍ (అల్ అన్‌ఆమ్: 109) అనగా "అల్లాహ్‌కు తప్ప వారు ప్రార్థనలలో పిలుచువారిని మీరు తిట్టకుము. లేనిచో వారు శత్రువులై మూఢత్వము వలన అల్లాహ్‌ను తిట్టెదరు. ఎందుకనగా వారికి అల్లాహ్ గూర్చి తెలియదు." చూడుము! దేవుని ఉపదేశానుసారము విగ్రహం పనికిరానిది. అయినను విగ్రహాలను తిట్టకూడదని సహనము పాటించమని దేవుడు ముస్లిములను బోధించుచున్నాడు. లేనిచో వారు ఆవేశానికి గురై అల్లాహ్‌ను తిట్టెదరు. ఆ తిట్లకు కారకులు మీరే అగుదురు. ఇస్లాం మహోన్నత ప్రవక్తను తిట్టుచు క్రూరముగా కించపరచుచు అతనిపై దాడి చేయువారి పరిస్థితి ఎట్లున్నది చూడుము. ఆ గొప్ప ప్రవక్త పేరు వినగానే ఇస్లాం మహారాజులు సింహాసనమును వీడుతారు. అతని ఆజ్ఞలను పాటింతురు. అతని అల్పదాసులలో తమను తాము లెక్కింతురు. ఈ గౌరవము దేవుని వైపు నుండి కాదా ! దేవుడిచ్చిన గౌరవమును అవమానించుట దేవునితో జగడము కోరు వారి పని. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్రమైన దైవ సందేశహరులు. వారికి సహాకార మందించుటకు, వారి గౌరవమును ప్రత్యక్షపరచుటకు దేవుడు గొప్ప గొప్ప నిదర్శనములు బహిర్గతము చేసెను. ఇది దేవుని కార్యము కాదా! ముహమ్మదీయ ఆస్థానములో 20 కోట్ల ప్రజలు శిరసావహించి వున్నారు. నిస్సందేహంగా ప్రతి ప్రవక్త తన సత్యమును నిరూపించుటకు ఏదేని నిదర్శనము కలిగియుండెను. కాని హూజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవకృత్వమును బలపరచుటకు బహిర్గతమైన సాక్ష్యాల ఉదాహరణ మరో ప్రవక్తలో మనకు లభించదు.

మీరు ఈ నిదర్శనమును అర్థం చేసుకోలేరు ! ఎప్పుడైతే భూమి

నేరము, పాపముతో అపవిత్రమగునో, దైవ త్రాసులో దుష్కార్యములు, దుష్ప్రవర్తనలు, హద్దులు మీరిన పనులు సత్కార్యముల కంటే అధికమవునో అప్పుడు దైవ కృప తన దాసులలోని ఒకరిని పంపి భూమిపై రగులుతున్న వివాదములను సంస్కరించును. అనారోగ్యము వైద్యున్ని కోరుతుందను విషయాన్ని మీరు అర్థం చేసుకునే అత్యధిక సామర్థ్యం కలిగివున్నారు. ఎందుకనగా మీ అభిప్రాయాల మేరకు నేరముల తుఫాను యవ్వనములో వున్న సమయములో వేదము అవతరించలేదు. నేరముల వరద భీభత్స పరిస్థితి లేనప్పుడు అది ప్రభవించెను. దుష్కార్యముల వరద ప్రతి దేశములో తన సంపూర్ణ వేగముతో అల్లకల్లోల, గందరగోళ స్థితిని సృష్టించుచున్న వేళ ఒక ప్రవక్త అవతరణ మీ దృష్టిలో అసంభవమా !

మీకు ఈ చారిత్రాత్మక సంఘటన తెలియదని నేనూహించలేను. అనగా మా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వ ఆస్థానమును తమ ఉనికితో సత్కరించిన కాలము అంధకారములో మునిగిపోయెను. ప్రపంచములోని ఏ పురము కూడ దుష్కార్యములతో, తప్పుడు విశ్వాసాలతో ఖాళీగా లేకుండెను. పండిత్ దయానంద్ గారు కూడ తన పుస్తకము సత్యార్థ్ ప్రకాశ్‌లో ఇట్లు వ్రాసిరి. ఈ కాలములో ఆర్య వరత్‌లో కూడ దైవారాధన చోటును విగ్రహారాధన ఆక్రమించుకుంది. వేద ధర్మములో చాలా వరకు మార్పులు చేర్పులు జరిగినవి.

మీజానుల్ హఖ్ రచయిత క్రైస్తవ ధర్మ మితవాది ఒక యూరోపియన్ ఆంగ్లేయుడు ఫాదర్ ఫండల్ గారిట్లు వ్రాసిరి. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలమున అన్ని జాతులకంటే క్రైస్తవ జాతియే అధికంగా సన్మార్గమును కోల్పోయి యుండెను. వారి దుష్కార్యములు క్రైస్తవ ధర్మానికే కలంకమయ్యెను. పవిత్ర ఖుర్‌ఆన్

స్వయాన తన అవతరణ అవసరాన్ని వివరిస్తూ ఈ సూక్తిలో ఇట్లు సూచించెను.

ظَهَرَ الْفَسَادُ فِي الْبَرِّ وَالْبَحْرِ (అల్ రూమ్:42) అనగా ఈ కాలములో భూ, జల భాగములలో మానవ కృత్యముల వలన ఉపద్రవ దుర్నీతి వ్యాపించెను. ఈ సూక్తి భావమేమనగా రాక్షస లక్షణాలు కలిగిన జాతి అయినను వివేకవాది అయిన జాతి కూడ పీడనరహితముగా లేకుండెను.

తూర్పు, పశ్చిమ ఆర్యవరత్ నివాసులు, అరబ్ ఎడారి వాసులు, దీవులలో నివసించు వారందరు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలములో మార్గభ్రష్టులైనారని సాక్ష్యాల ద్వారా రూఢీ అవుతుంది. దేవునితో విస్పష్ట సంబంధమున్న ఒక్క వ్యక్తి కూడా లేకుండెను. దుష్కార్యములు భూమిని అపవిత్రం చేసియుండెను. ఇటువంటి అంధాకారముతో కూడిన ఈ కాలములోనే ఒక అద్భుతమైన గొప్ప ప్రవక్త అవతరించవలెనని ఒక్క వివేకుడు కూడ అర్థం చేసుకోలేక పోయెనా !

ఈ ప్రవక్త ప్రపంచములో ప్రభవించి చేసిన సంస్కరణ ఏమిటని ప్రశ్న తలెత్తును. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సంస్కరణ గురించి ఒక ముస్లిం వ్యక్తి ఇవ్వగలిగే నిదర్శనములతో కూడిన స్పష్టమైన సమాధానము క్రైస్తవుడు, యూదుడు, ఆర్యుడు ఇవ్వలేడని నేను గట్టిగా చెప్పగలను.

అరబ్బుల సవరణ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రథమ ఉద్దేశం. అరబ్బు దేశ దుర్భర పరిస్థితిని గమనించినచో వారిని మానవులనడం కష్టం. వారిలో లేని పాపమే లేకుండెను. వారిలో విగ్రహారాధన ప్రబలియుండెను. చౌర్యం, దోచుకోవడం వారి దిన చర్య. కారణము లేనిదే హత్య చేయడం వారి దృష్టిలో చీమను పాదాల క్రింద నలగద్రొక్కునంత మాత్రమే. బాలలను హత్య చేసి వారి ధనము

ఆర్జించేవారు. బాలికలను సజీవ సమాధి చేసేవారు. వ్యభిచారమును గర్వకారణముగా భావించేవారు. పద్యములలో ఆ అశ్లీల విషయాలను బహిరంగంగా ప్రస్తావించేవారు. మధ్యపానం ఎంత అత్యధికంగా వుండెననగా ఏ ఒక్క గృహం కూడ మద్యం లేకుండా ఉండేది కాదు. జూదములో అన్ని దేశాల కంటే ప్రథమ స్థానంలో యుండెను. జంతువుల స్థాయి నగ్నత్వము, సర్పముల, తోడేళ్ళ స్థాయికి దిగజారిన సిగ్గుమాలినతనం సర్వసాధారణమై యుండెను.

మా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని మనస్ఫూర్తిగా శ్రద్ధ వహించి సంస్కరించుటకు సంకల్పించినపుడు కొద్ది దినములలోనే వారి యందు క్రూరత్వము మాయమై, మానవులైరి. మానవులే గాక సభ్యత గల మానవులైరి. సభ్యత గల మానవులే కాదు ధర్మాత్ములైరి. తుదకు వారు దైవ ప్రేమలో ప్రతి దుఃఖమును భరించిరి. వివిధ రకముల హింసలతో వారు శిక్షించబడిరి. క్రూరంగా, నిస్సంకోచంగా కొరడాతో చితక్కొట్టబడిరి. మండుతున్న ఇసుకలో పరుండబెట్టబడిరి. బంధించి, ఆకలి, దాహంతో వుంచడం వలన మృత్యువు ముంగిట చేర్చబడిరి. కాని వారు ప్రతి ఆపదలో ముందుకే కదిలిరి. అనేక సభ్యుల ఎదుట వారి సంతానము హత్య చేయబడెను. సంతానము సమక్షమున అనేకులను శిలువపై ఎక్కించనైనది. వారు దైవ మార్గములో ప్రాణాలర్పించిన తీరును ఊహించినచో దుఃఖము కలుగక మానదు. వారి హృదయాలపై దైవము అతని ప్రవక్త ప్రభావము లేనిచో వారిని ఇస్లాం వైపు ఆకర్షింపచేసిన మరో విషయమేమిటి ? ఒక అసాధారణ మార్పు వారిలో సృష్టించి వారిని బలహీన, నిరుపేద, నిరాయుధ స్థితిలో మక్కా వీధులలో ఒంటరిగా తిరిగే ఒక వ్యక్తి సన్నిధిలో చేర్చినదేమిటి ? ఏదేని ఒక ఆధ్యాత్మిక శక్తి వుంటేనే కదా వారు అధమ స్థితి నుండి ఉత్తమ స్థానమునకు ఎదిగిరి.

విచిత్రకర విషయమేమనగా వారిలోని అధికులు అవిశ్వాస కాలములో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ప్రాణ శత్రువులు, వారి రక్తపు దాహంతో రగిలిపోయేవారు. ఒక నిరుపేద, దీనుడు, నిరాశ్రయుడైన ఒంటరి వ్యక్తి వారి హృదయాలను ప్రతి కపటము నుండి శుభ్రపరచి తమ వైపు ఆకర్షించెను. ఇంతేకాక వారు గర్వకారణమైన వస్త్రమును పారవేసి తట్లు ధరించి వచ్చిరి దీని కంటే గొప్ప మహత్యముండదని నేననుకుంటాను.

వీరందరు బలవంతంగా ఖడ్గ బలముతో ఇస్లాంలో చేర్చబడినారని ఇస్లాంపై జిహాద్ నింద వేయుచు పలువురు అవివేకులు ఆరోపింతురు. విచారము ! వేలాది వేల విచారము !! వారు అన్యాయముగా సత్యమును దాచిపెట్టుటలో హద్దులు దాటిరి. విచారము ! వారికేమైనది. యదార్థమైన సంఘటనలను కావాలని అబద్ధీకరించిరి. మా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అరబ్ దేశములో ఒక చక్రవర్తిగా రాలేదు. కనుక రాజగర్వము, వైభవము వారి వెంట ఉన్నందున ప్రజలు తమ ప్రాణాలు రక్షించుకొనుటకై వారి జెండా క్రింద చేరారని సందేహించుటకు ఆస్కారం లేదు.

వారు సల్లం తమ బీద, నిస్సహాయత, దీన స్థితిలో ఒంటరిగా దైవ ఏకత్వం, తన ప్రవక్తృత్వం గురించి ప్రకటించినపుడు ఏ ఖడ్గ భయముతో ప్రజలు వారిని విశ్వసించారను ప్రశ్న పుట్టును. విశ్వసించనిచో బలవంతము చేయుటకు ఏ చక్రవర్తి నుండి సైన్యం పిలిపించబడెను లేదా సహాయము కోరబడెను. ఓ సత్యాన్వేషులారా ! నిశ్చయముగా ఇవన్నీ ఇస్లాం విరోధుల ఆరోపణలని గమనించుము. చరిత్రను పఠించుము. భూమి పై అడుగు పెట్టకముందే తండ్రిని కోల్పోయి, కొన్ని మాసాలలోనే తల్లి నీడ కూడ పోగొట్టుకున్న ఒక అనాథ బాలుడే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. అప్పుడు దైవ హస్తము కలిగిన ఆ బాలుడు

ఎవరి సహాకారము లేకుండా దైవ సంరక్షణలో పోషణ పొందెను. ఈ ఆపద, అనాథ కాలములో పలువురి మేకలను కూడ మేపిరి. దేవుడు తప్ప మరెవ్వడూ పోషకుడు లేకుండెను. ఇరవై అయిదు సంవత్సరములకు చేరినను ఏ చిన్నాన్న కూడ తన కూతురితో వివాహము చేయించ లేదు. ఎందుకనగా వారికి సంసార ఖర్చులు భరించే స్థోమత లేకుండెను. అదిగాక నిరక్షరాస్యులు, ఏదేని వృత్తి, కళ తెలిసినవారు కాదు. వారు 40 సంవత్సరములకు చేరినప్పుడు ఒక్కసారిగా వారి మనస్సు దేవుని వైపు మళ్ళెను. మక్కా నుండి కొన్ని మైళ్ళ దూరాన హిరా అను నామము గల ఒక గుహయుండెను. ఒంటరిగా అచటికి వెళ్ళి గుహలో దాక్కొని దైవ ధ్యానములో నిమగ్నమయ్యేవారు. ఒక రోజు అదే గుహలో దైవ జ్ఞాపకములో ఉండగా దేవుడు వారిపై ప్రత్యక్షమయ్యెను. ప్రపంచము దైవ మార్గమును విస్మరించింది. నేరాలతో భూమి నిండినది. అందుకే నేను నిన్ను నా సందేశహరునిగా పంపుచున్నాను. శిక్ష పడక ముందే వారు దేవుని వైపు తిరగి రావలెనని నీవిప్పుడు లోకులను హెచ్చరించుమని ఆదేశమివ్వబడెను. ఈ ఆజ్ఞను విని నేను నిరక్షరాస్యుడినని వారు భయాందోళనకు గురైరి. నేను చదవలేననిరి. అప్పుడు దేవుడు వారి యదలో ఆధ్యాత్మిక విద్యలన్నియు నింపెను. వారి హృదయాన్ని ప్రకాశవంతముగా చేసెను. వారి పవిత్రతా శక్తి ప్రభావముతో నిరుపేదలు, బలహీనులు వారి విధేయత పరిధిలో ప్రవేశించుట ప్రారంభించిరి. ధనికులు, సుసంపన్నులు శత్రుత్వమునకు కంకణం కట్టిరి. తుదకు వారిని హతమార్చుటకు కూడ వారు సంకల్పించిరి. అనేకానేక పురుషులు, స్త్రీలు ఘోరమైన బాధలతో హత్య చేయబడిరి. అంతిమ దాడిలో వారు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను హతమార్చుటకు వారి గృహాన్ని నిర్భందించిరి. కాని దేవుడు రక్షించిన వారిని ఎవరు అంతము చేయగలరు. తమరు ఈ నగరము వదిలి వెళ్ళిపొమ్మని నేను అడుగడుగున నీ వెంట

ఉందునని దేవుడు సువార్త వాణి పంపెను. కావున హ[జత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, హ[జత్ అబూబకర్ రజియల్లాహు అన్హును వెంట పెట్టుకొని నగరము నుండి బయలు దేరిరి. మూడు రా[తుల వరకు సౌర్ అనే గుహలో తలదాచుకొనిరి. శ[తువులు వెంబడించిరి. ఒక అన్వేషకుణ్ని తీసుకొని గుహ వద్దకు వచ్చితిరి. ఆ వ్యక్తి గుహ వరకు పాద అడుగులను కనుగొనెను. అతడు ఈ గుహలో వెతకమనెను. దీనికి ముందు అడుగుజాడలు లేవు. ముందుకు వెళ్ళినాడంటే ఆకాశమునకు ఎగిరిపోవచ్చుని స్పష్టము చేసెను. కాని దైవ సృష్టి విచి[తాలను ఎవరు చేధించగలరు. దేవుని మహిమతో సాలెపురుగు తన వలతో ఒక్క రా[తిలోనే ఆ గుహ ముఖద్వారాము మూసివేసెను. ఒక పావురము గుహ ముందు భాగాన గూడు కట్టి అందులో [గుడ్లు పెట్టెను. అన్వేషకుడు వారిని గుహలో [పవేశించమని కోరగా ఒక వృద్ధుడు "ఈ అన్వేషకుడు మతి కోల్పోయాడు నేను ఈ వలను ఈ గుహ ముఖముపై ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించక ముందు నుండి చూస్తున్నా"ని చెప్పెను. ఈ విషయము విని అందరు విడిపోయిరి. గుహ ఆలోచననే వదిలి పెట్టిరి.

ఆ తర్వాత హ[జత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం రహస్యంగా మదీన చేరుకున్నారు. మదీనలోని అధికులు వారిని స్వీకరించిరి. మా చేతుల నుండి వేట జారిపోయిందని మక్కా వాసులు ఉద్వేగానికి గురైనారు. ఇంకేముంది రా[తింబవళ్ళు హ[జత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను హతమార్చుటకు [పణాళికలు రూపొందించడం [పారంభించిరి. మక్కా వాసులలో హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించినవారు మక్కా నుండి విభిన్న దేశాలకు వలస వెళ్ళిపోయిరి. పలువురు హబ్ష రాజు వద్ద రక్షణ పొందిరి. [పయాణ వ్యయం భరించే స్థోమత లేని వారు కొందరు మక్కాలోనే ఉండిపోయిరి. వారు అత్యధికంగా బాధించబడిరి. వారు ఎట్లు రా[తింబవళ్ళు దైవ

సహాయమునకై అభ్యర్థించిరో పవిత్ర ఖుర్‌ఆన్‌లో గలదు.

అవిశ్వాసులైన ఖురైషీలు దౌర్జన్యపు హద్దులు దాటి నిరుపేద స్త్రీలను, అనాధ బాలలను హత్య చేయసాగిరి. కొందరు స్త్రీల రెండు కాళ్ళను రెండు తాళ్ళతో బిగించి ఆ తాళ్ళను రెండు ఒంటెలకు కట్టి ఒంటెలను రెండు విరుద్ధ దిశలకు (అనగా కుడి ఎడమల) వైపు పరుగెత్తించిరి. ఆ స్త్రీలు రెండు ముక్కలై మరణించిరి.

దయాహీనులైన అవిశ్వాసుల హింస తారాస్థాయికి చేరుకున్నప్పుడు తమ దాసులను కరుణించే దేవుడు తన ప్రవక్తకు ఇట్లు సందేశమిచ్చెను. హింసించబడిన వారి హాహాకారాలు నా వరకు చేరినవి. మీరు కూడ వారిని ఎదురించుటకు నేడు నేను అనుమితి ఇచ్చుచున్నాను. అమాయక ప్రజలపై ఖడ్గము లేపిన వారు అదే ఖడ్గముతో హతమార్చబడుదురని జ్ఞప్తియందుంచుకొనుము. కాని మీరు హద్దులు దాటకుము. ఎందుకనగా దేవుడు హద్దులు దాటే వారిని మిత్రులుగా భావించడు.

ఇది ఇస్లాం జిహాద్ (ధర్మ యుద్ధ) వాస్తవికత. దీనిని క్రూరంగా అవమానకర రీతిలో వ్యక్తపరచనైనది. నిస్సందేహంగా దేవుడు కృపాశీలుడు. కాని ఏదేని జాతి తన దౌష్ట్యములో హద్దులు దాటితే అతను హింసించే వారిని శిక్షంచక వదలడు. స్వయాన తానే వారి వినాశనమునకు ఏర్పాట్లు చేయును. ఇస్లాం ఖడ్గ బలముతో విస్తరించిందని మా విరోధులు ఎక్కడ, ఎవరితో విన్నారో నాకు అంతుపట్టడం లేదు. దేవుడు మాత్రం పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇట్లు తెలిపెను. لَآ اِكْرَاهَ فِى الدِّيْنِ (అల్ బఖరహ్: 257) అనగా ఇస్లాం ధర్మములో బలవంతము నిషేధించబడినది. మరి బలవంతపు ఆజ్ఞ ఎవరిచ్చారు. బలవంతమునకు ఎలాంటి కారణములుండెను. బలవంతంగా ముస్లిములైన వారు ఇటువంటి సత్యము, విశ్వాసము కలిగి వుందురా ! ఎలాంటి వేతనము పొందకుండా

300 మంది మాత్రమే వేలాది మందిని ఎలా ఎదురించగలిగిరి. వేల సంఖ్యకు చేరుకున్నప్పుడు కొన్ని లక్షల శత్రువులను మట్టికరిపించిరి. ధర్మాన్ని శత్రువు దాడి నుండి రక్షించుటకు గొర్రెలు, మేకల వలె తలలు అర్పించిరి. ఇస్లాం సత్యాన్ని నిరూపించుటకు తమ రక్తమును ప్రవహింపజేసిరి. దైవ ఏకత్వమును వ్యాపింపజేయుటకు సన్యాసపు రీతిలో కష్టాలు భరించుచూ ఆఫ్రికా ఎడారి వరకు చేరిరి. ఆ దేశములో ఇస్లాంను వ్యాపింపజేసిరి. ప్రతి బాధ భరించుచూ చైనాకు చేరారు. యుద్ధము చేయుటకు కాదు సన్యాసపు తరహాలో ఆ దేశములో ఇస్లాం ఆహ్వానాన్ని అందించుటకు, ఫలితంగా వారి పవిత్ర ఉపదేశము వలన అనేక కోట్ల ముస్లింలు జన్మించవలెనని వారి కోరిక. సన్యాస రూపంలో భారత దేశానికి వచ్చి ఆర్య వరత్ లోని చాలా భాగములో ఇస్లాంను వ్యాపింపచేసి, ఐరోపా హద్దుల వరకు "లాఇలాహ ఇల్లల్లాహు" పిలుపును అందించుటకు పాటుపడిరి. హృదయంలో అవిశ్వాసాన్ని దాచుకొని పైకి మాత్రం ముస్లిములుగా ప్రకటించుకునే, బలవంతంగా ముస్లిములుగా మార్చబడిన వారు ఇలాంటి త్యాగాలు చేయగలరా ? మీరు న్యాయముగా తెలుపుము.

కానే కాదు ! హృదయాలు విశ్వాస కాంతితో ఉప్పొంగి, మనస్సులలో దేవుడు వున్న వారు మాత్రమే ఇలా చెయ్యగలరు.


ఇస్లాం బోధన ఏమిటి ? దైవ ఏకత్వము, మహత్యమును భూమిపై స్థాపించి, అన్యారాధనను పూర్తిగా నిర్మూలించి వివిధ జాతులను ఒకే తాటిపై స్థిరపరచి ఒకే జాతిగా మార్చడమే ఇస్లాం బోధన. గతంలో ప్రపంచమంతటా అవతరించిన సమస్త ధర్మములు, ప్రవక్తలు, సందేశహరుల దృష్టి కేవలం తమ జాతి, తమ దేశము వరకు పరిమితమైయుండెను. ఒక వేళ వారు నీతులు బోధించినను అవి ఆ జాతి వారి వరకే పరిమితమై యుండెను. నా విద్య కేవలం ఇస్రాయీల్ సంతతి వరకే పరిమితమని స్పష్టంగా హజ్రత్ మసీహ్ అలైహిస్సలాం

వివరించియున్నారు. ఇస్రాయీల్ సంతతికి చెందని ఒక స్త్రీ వినయంగా వారిని మార్గదర్శనము చూపమని కోరినప్పుడు వారు ఆమె అభ్యర్థనను తిరస్కరించిరి. ఆ నిరుపేద స్త్రీ తనకు తాను శునకముతో పోల్చుకొని మరల మార్గదర్శనము కోరినప్పుడు నేను ఇస్రాయీల్ గొర్రెల కొరకు మాత్రమే పంపబడితినని ఆమెకు సమాధానము లభించెను. ఫలితంగా ఆమె మౌనం దాల్చెను. కాని మా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అరబ్బు వాసుల కొరకే పంపబడితినని ఎక్కడా వ్యాఖ్యానించలేదు. పవిత్ర ఖుర్‌ఆన్‌లో వారిని ఇట్లు ఆదేశించనైనది. قُلْ يَا أَيُّهَا النَّاسُ إِنِّي رَسُولُ اللَّهِ إِلَيْكُمْ جَمِيعًا (అల్ ఆరాఫ్: 159) అనగా నేను సర్వలోకాని కొరకు పంపబడితినని ప్రకటించుము ! ఆ స్త్రీకి హజ్రత్ ఈసా అలైహిస్సలాం ఇచ్చిన స్పష్టమైన సమాధానములో హజ్రత్ ఈసా అలైహిస్సలాం తప్పిదము లేదని జ్ఞప్తియందుంచుకొనుము! ఎందుకనగా ఇంకా సార్వజనిక మార్గదర్శన సమయం రాకుండెను. "నీవు ప్రత్యేకముగా ఇస్రాయీల్ సంతతి కొరకే పంపబడితివని ఇతరులతో నీకెలాంటి సంబంధము లేదని" దేవుడు హజ్రత్ ఈసా అలైహిస్సలాంను ఆజ్ఞాపించియుండెను. ఇంతకు ముందు నేను వివరించినట్లు హజ్రత్ ఈసా అలైహిస్సలాం ప్రవర్తన నియమావళి కేవలం యూదుల వరకే పరిమితమైయుండెను. వాస్తవమేమనగా దంతమునకు బదులు దంతము, నేత్రమునకు బదులు నేత్రము, ముక్కుకు బదులు ముక్కు అని తౌరాత్‌లో నున్న ఆజ్ఞలు. యూదులలో న్యాయ వ్యవస్థను స్థాపించుట, వారు హద్దులు దాటకూడదనే ఈ బోధన ఉద్దేశము. ఎందుకనగా వారు 400 సంవత్సరముల పాటు బానిస జీవితము గడిపియుండిరి. వారిలో హింస, దౌర్జన్యము లాంటి నీచ లక్షణములు జన్మించియుండెను. వారి స్వభావాలలో ప్రతీకార క్రూరత్వము రగులుతుందని దేవుని తత్వజ్ఞానము ఇదే కోరింది. దానిని దూరము చేయుటకు దృఢమైన ప్రవర్తన గురించి బోధించవలసియుండెను. ఆ

ప్రవర్తనా నియమావళికే బైబిల్ ప్రతీక. అది సర్వ లోకానికి కాదు కేవలం యూదులకే, ఎందుకనగా ఇతర జాతులతో హజ్రత్ ఈసా లైహిస్సలాం కు ఎలాంటి సంబంధం లేకుండెను.

కాని యదార్థమేమనగా హజ్రత్ ఈసా అలైహిస్సలాం అందించిన విద్యలో వున్న మొదటి లోపము ప్రపంచపు సాధారణ సానుభూతి పొందడమే గాక తౌరాత్ కఠినము, ప్రతీకారము బోధించి గరిష్ట స్థాయికెదిగితే బైబిల్ క్షమాపణ, ఉపకారము బోధించి కనిష్ట స్థాయికి దిగజారిపోయింది. ఈ రెండు గ్రంధములు మానవ వృక్ష శాఖలన్నిటిని పరిగణించక ఈ వృక్షపు ఒక శాఖను తౌరాత్ ప్రస్తావించితే ద్వితీయ శాఖను బైబిల్ ప్రస్తావించెను. ఈ రెండు విద్యలు కూడ సమానత్వ స్థాయిని కోల్పోయినవి. ఎందుకనగా ఎలాగైతే ప్రతి సమయమున, ప్రతి చోట ప్రతీకారం తీర్చుకొనుట, శిక్షించుట అవివేకమగునో అటులనే ప్రతి సందర్భమున క్షమించుట, మన్నించుట కూడ మానవ సవరణకు విరుద్ధం. అందు వలన పవిత్ర ఖురాన్ ఈ రెండు విద్యలను రద్దు చేసి ఈ విధంగా ఉపదేశించింది. جَزٰٓؤُا سَيِّئَةٍ سَيِّئَةٌ مِّثْلُهَا ۚ فَمَنْ عَفَا وَاَصْلَحَ فَاَجْرُهٗ عَلَى اللّٰهِ (అల్ షూరా : 41) అనగా దుష్కార్య ప్రతిఫలము అంతే దుష్కార్యము. ఇది పాత నిబంధన (తౌరాత్) ఉపదేశము కాని ఎవరైనా క్షమించినచో హర్షించదగిన అంశమే ఇది క్రొత్త నిబంధన (ఇంజీల్) బోధన. సత్ఫలితము వెలువడే అవకాశమున్నచో క్షమించుట ప్రశంసనీయము, సమంజసమైనదే. క్షమించబడిన వ్యక్తిలో మంచి మార్పు ఏర్పడే ఆస్కారమున్నచో క్షమించుట భావ్యమే. కాని తౌరాత్‌లో ప్రస్తావించబడినదే చట్టము.

Shanti Sandeshamu
(Telugu)



## ABOUT THE BOOK

In a world plagued with intolerance for cultural, racial and religious differences, *A Message of Peace* serves as a panacea to the ills of the society. Prophetic in foresight and universal in scope, this book lays out a path to the peaceful existence of all humans based on the central theme of worshipping the One God. It is not surprising therefore that *A Message of Peace* forms the last work of a man who was destined to lay the foundation for the establishment of peace in this day and age and whose advent was prophesied in all major religions of the worldthe Promised Messiah and Reformer of the Latter Days.

My countrymen! writes the Promised Messiah,A religion which does not inculcate universal compassion is no religion at all. Similarly a human being without the faculty of compassion is no human at all.